

సాక్షి నిర్మల్

శనివారం | 30 | డిసెంబర్ | 2023



బడులకేదీ ఉచితం..
గృహ అవసరాలకు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ప్రభుత్వ పాఠశాలలకు కూడా ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. 10లో▸




పోటెత్తిన దరఖాస్తులు 11లో▸
గ్యారంటీల అమలుకు ప్రభుత్వం ప్రజాపాలన సభలు నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, మూడు మున్సిపాలిటీల్లో శుక్రవారం నిర్వహించిన సభలకు దరఖాస్తులు పోటెత్తాయి.

గరిష్ఠం/కనిష్ఠం
28.4 / 16.7

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తగ్గుతాయి. అర్ధరాత్రి తర్వాత చలి తీవ్రత పెరుగుతుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించాలి



మాట్లాడుతున్న శ్రీయాన్

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల ఖర్చుల వివరాలను నిర్దేశించిన నమూనాలో వారం రోజుల్లో సమర్పించాలని ఎన్నికల ఖర్చుల పర్యవేక్షకుడు శ్రీయాన్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు వారి ఎన్నికల ఖర్చుల వివరాల నిర్దేశించిన రిజిస్టర్లలో రశీదులతో సహా ఉపయోగించిన బ్యాంక్ అకౌంట్ నంబర్లతో సహా సమర్పించాలని వివరించారు. లేనిపక్షంలో తదుపరి ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా పరిగణించబడతారని తెలిపారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవోలు, రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎన్నికల ఖర్చుల సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తున్నాం


- డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు



వివరాలు తెలుసుకుంటున్న శ్రీహరిరావు

మామడ: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మండలంలోని ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. అభయహస్తం కింద దరఖాస్తు చేసుకునే వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అన్ని పథకాలకు ఒకే దరఖాస్తును చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జైసింగ్, సంతోష్, రమణరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పడాల శ్రీనివాస్, భీమేశ్ పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ రద్దు చేయాలి



మాట్లాడుతున్న సురేశ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి నేరుగా కార్మికుల అకౌంట్‌లోనే ప్రతీనెల జీతాలు వేయాలి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ప్రతీనెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని కోరారు. సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో గౌతమి, అరుణ పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయించాలి

నిర్మల్‌చైన్‌గేట్: బహిరంగ మార్కెట్లో పత్తి ధర రోజురోజుకీ పతనమవుతున్న తరుణంలో రైతులు సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ తెలిపారు. కనీస మద్దతు ధర రూ.7,020 కన్నా తక్కువకు అమ్ముకుని రైతులు నష్టపోవద్దని జిల్లాలో 17 జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకువచ్చేటప్పుడు రైతులు తమ ఆధార్ ప్రామాణీకరణ చేయించుకోవాలని సూచించారు. రైతులు వేలిముద్ర (బయోమెట్రిక్) విధానం ద్వారా తమ ఆధార్ ప్రామాణీకరణ చేయించుకోవాలని పేర్కొన్నారు. పత్తిలో తేమశాతం 12 మించకుండా ఉండాలని తెలిపారు.

డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లించాలి

నిర్మల్ ఖిల్లా: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం సమన్వయకర్త అజయ్ తెలిపారు. మూడో సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 16 నుంచి 22 తేదీ వరకు, ఐదో సెమి స్టర్ పరీక్షలు ఫిబ్రవరి 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహించినట్లు వివరించారు. జనవరి 17వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. వివరాలకు అధ్యయన కేంద్రాన్ని 99517 53810 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

మారిన రాజకీయం



రామారావు పటేల్‌తో బండి సంజయ్(ఫైల్)





కూచాడి శ్రీహరిరావుతో రేంత్‌రెడ్డి(ఫైల్)

- జిల్లా ఈఏడాది.. సమ్‌థింగ్ స్పెషల్
- అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లా వినూత్న తీర్పు
- కారుపాయే.. కమలం విరిసే.. కాంగ్రెస్ మెరిసే..
- అక్కడోళ్లు ఇటు.. ఇక్కడోళ్లు అటు..
- ఈసారి కథ మొత్తం అడ్డం తిరిగింది

ప్రధాని సహా.. అతిథులెందరో..

ఎన్నికల పుణ్యమా.. అని ఈఏడాదిలో జిల్లాకు ఊహించని అతిథులొచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ తొలిసారి నవంబర్ 26న నిర్మల్‌కు వచ్చారు. భారీ బహిరంగసభలో పాల్గొన్నారు. అదేరోజున ఖానాపూర్ సభలో అప్పటి సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. అంతకుముందు ఆయన నవంబర్ 2న నిర్మల్, 3న భైంసా సభలకు వచ్చారు. నవంబర్ 15న పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి నిర్మల్‌సభలో పాల్గొన్నారు. అదేనెల 17న భైంసాకు బీజేపీ నేత బండిసంజయ్ రాగా, 19న ఖానాపూర్ సభకు కాంగ్రెస్ అధినాయకురాలు ప్రియాంకగాంధీ వచ్చారు. అలాగే ఏలేటి నామినేషన్ ర్యాలీతో పాటు ముధోల్ ఎన్నికల సభలో ఈటల రాజేందర్ హాజరయ్యారు.

నిర్మల్: జిల్లా ఈ ఏడాది పొలిటికల్ సీన్ మారింది. నేతల యాత్రలతో మొదలైన ఎన్నికల సందడి.. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల తీర్పుతో ముగిసింది. మరోవైపు ఇటోళ్లు అటు.. అటోళ్లు ఇటు.. అన్నట్లుగా కథ మొత్తం అడ్డం తిప్పేసింది. ఊహించని తీర్పు నే'తల'రాతను మార్చేసింది. మొత్తం మీద జిల్లా రాజకీయ చరిత్రలో ఈ ఏడాది కొత్త మార్పులను జతచేసింది. ఏడాది చివరన జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లా వినూత్న ఫలితాలనిచ్చింది. పదేళ్ల అధికారంలో ఉన్న కారు పార్టీని కాదంది. ఎప్పటి నుంచో గెలుపు కలలు కంటున్న కమలాన్ని ఎత్తుకుంది. కాంగ్రెస్‌నూ నారాజ్ చేయకుండా చెయ్యి పట్టుకుంది. ఈఏడాదిలో పలువురు బడా నేతలు పార్టీలు మారి, తమ రాజకీయ భవిష్యత్తునే మార్చుకున్నారు. ఎన్నెన్నో రాజకీయ మలుపులతో ఆసక్తికరంగా సాగుతూ ఎన్నికల నామసంవత్సరం ముగుస్తోంది.

అలా.. మొదలైంది..
ఈనెల ప్రారంభం వరకు జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులే అధికారంలో కొనసాగారు. మంత్రిగా ఉన్న ఇంద్రకరణ్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యేగా ఉన్న విఠల్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ విస్తరణలో భాగమయ్యారు. ఫిబ్రవరి 4న నాందేడ్‌లో నిర్వహించిన సభ కోసం జనవరిలో మహారాష్ట్ర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. సరిహద్దు మరాఠా తాలూకాల్లోని గ్రామాలకు వెళ్లి అప్పటి సీఎం కేసీఆర్ సభకు రావాలని, బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని ప్రచారం చేశారు. ఏడాది ప్రారంభంలోనే నిర్మల్ మున్సిపాలిటీ మాస్టర్‌ప్లాన్‌పై ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు ఆందోళనలు జోరందుకున్నాయి.

మొదట్లో.. 'చేయి' జారారు..
మొదట్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి జిల్లాలో ఘోరంగా ఉండేది. పార్టీలో ఉన్న సీనియర్ నేతలు, కౌన్సిలర్లు, సర్పంచులూ పార్టీని వీడారు. ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్‌గా ఉన్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మార్చిలోనే పార్టీపై ఆరోపణలు చేస్తూ క్రమంగా కాంగ్రెస్‌కు దూరమవుతూ వచ్చారు. ఏప్రిల్‌లో తన అనుచరులందరితో కలిసి కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. దీంతో హస్తం పార్టీ ఒక్కసారిగా అస్తవ్యస్తమైంది.

కాంగ్రెస్‌లోకి కూచాడి, పత్తిరెడ్డి..
ఈఏడాది ఏప్రిల్ నెలలోనే జిల్లాలో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఓ వైపు మహేశ్వర్‌రెడ్డి తన వర్గంతో సహా కాంగ్రెస్‌ను వీడగా, మరోవైపు బీఆర్‌ఎస్‌లో సీనియర్ నేతగా, ఉద్యమకారుడిగా గుర్తింపు ఉన్న కూచాడి శ్రీహరిరావు ఒక్కసారిగా సొంతపార్టీపై విరుచుకుపడ్డారు. మరోవైపు సారంగపూర్ జెడ్పీటీసీ సభ్యుడు, సీనియర్‌నేత పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఏప్రిల్‌లోనే కారు వీడి కాంగ్రెస్‌లో చేరారు. జూన్ 14న శ్రీహరిరావు సైతం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా వేసుకున్నారు. ఆయనకే డీసీసీ అధ్యక్ష పదవిని పార్టీ కట్టబెట్టింది.

'కారు'కు దూరమైన రేఖ..
ఈ ఏడాది ఖానాపూర్ నియోజకవర్గంలో రాజకీయ సంచలనం చోటుచేసుకుంది. రెండుసార్లు వరుసగా గెలిచిన సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు బీఆర్‌ఎస్ మొండిచేయి చూపుతూ కేటీఆర్ మిత్రుడు జాన్సన్ నాయక్‌కు టికెట్ ఇచ్చారు. దీంతో రేఖానాయక్ కారుకు దూరమై.. తన భర్త శ్యాంనాయక్‌తో కలిసి కాంగ్రెస్‌కు దగ్గరయ్యారు.

ముధోల్.. అసమ్మతి స్పెషల్..
ఎన్నికల నామసంవత్సరంగా సాగిన ఏడాదిలో అసమ్మతిరాగాలూ బాగానే వినిపించాయి. ప్రధానంగా ముధోల్ నియోజకవర్గంలో ఏకంగా జెడ్పీటీసీ సభ్యులు, ఏఎంసీ చైర్మన్, సీనియర్ నేతలంతా సిట్టింగ్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిపై అసమ్మతి వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ అధిష్ఠానం పట్టించుకోకపోవడంతో వారంతా ఒక్కసారిగా బీజేపీలో చేరి రామారావుపటేల్ విజయంలో భాగమయ్యారు.

కాంగ్రెస్, కమలం వీడి.. కారెక్కారు..
రెండుస్థానాల్లో గెలిచిన బీజేపీ, ఒక స్థానం దక్కించుకున్న కాంగ్రెస్‌లను కాదని పలువురు సీనియర్లు కారెక్కారు. వారు ఏమాత్రం ఊహించని ఓటమిని మూటగట్టుకున్నారు. పార్టీ టికెట్ ఆశించిన నిర్మల్ మున్సిపల్ మాజీచైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తి, పెంబి జెడ్పీటీసీ సభ్యురాలు భుక్య జానుబాయి బీజేపీని వీడి, అలాగే ముధోల్‌కు చెందిన కాంగ్రెస్‌నేత డాక్టర్ కిరణ్‌కొమ్రేవార్ చేతిని వదిలి బీఆర్‌ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ గిరిజన విభాగం రాష్ట్రనేత భరత్‌చౌహాన్ బీఆర్‌ఎస్‌లో చేరారు.

రాత మార్చిన ఓటరన్న..

- ఏడాది చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతటా ఒకలా ఉంటే.. జిల్లా మాత్రం ప్రత్యేకంగా నిలిచింది. ఊహాకందని తీర్పులతో పార్టీలను ఉక్కిరిబిక్కిరి చేసింది.రెండుసార్లు మంత్రిగా ఉన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఓడిపోయారు. డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సీనియర్‌నేత శ్రీహరిరావు డిపాజిట్ దక్కించుకోలేకపోయారు. ఇక ఎవరూ ఊహించని విధంగా బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఏకంగా 50 వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించారు.
- ముధోల్ నియోజకవర్గంలో పార్టీపరంగా తప్ప ప్రజల్లో పెద్దగా వ్యతిరేకత లేని బీఆర్‌ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డి ఓడిపోయారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి నారాయణరావుపటేల్ కనీస పోటీ ఇవ్వలేదు. ఇక ఎప్పటి నుంచో ఒక్కసారి గెలిపించాలంటూ కోరుతున్న బీజేపీని, ఆపార్టీ అభ్యర్థి రామారావుపటేల్‌ను ఓటర్లు మంచి మెజార్టీతో గెలిపించారు.
- ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గంలో ఈసారి ఎన్నికల్లో అద్భుతమే జరిగింది. కేటీఆర్ దోస్తు, బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్, సీనియర్‌నేత బీజేపీ అభ్యర్థి రమేశ్ రాథోడ్‌ను కాదని.. పేద ఆదివాసీ బిడ్డ, కాంగ్రెస్‌ను బరిలో నిలిపిన వెడ్మ బొజ్జుపటేల్‌ను ఓటర్లు గెలిపించారు. జిల్లాలో కాంగ్రెస్‌కు ఊపిరిపోశారు.

'ప్రజాపాలన' వినియోగించుకోవాలి

- ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ప్రశాంతి

నిర్మల్‌టౌన్/మామడ/దిలావర్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ప్రశాంతి అన్నారు. నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని బాగులవాడ 9 వార్డులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి పరిశీలించారు. మామడ మండలం బండల ఖానా పూర్‌లో అభయహస్తం దరఖాస్తులు స్వీకరణను, దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్, న్యూలోలం గ్రామాల్లోనూ ప్రజాపాలన గ్రామ సభలను సందర్శించారు. అభయ హస్తం ఐదు గ్యారంటీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగ పరుచుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ రాజు, మామడ ఎంపీడీవో రమేశ్, తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, దిలావర్‌పూర్ ఎంపీడీవో మోహన్, తహసీల్దార్ సరిత, ఎంపీవో అజీజ్‌ఖాన్, సిర్గాపూర్ సర్పంచ్ గంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఏలేటి రవీందర్‌రెడ్డి, న్యూలోలం సర్పంచ్ ఒవ్వం సవిత తదితరులు పాల్గొన్నారు.



వార్డు సభను పరిశీలిస్తున్న ప్రశాంతి




సిర్గాపూర్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కడెం: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాను మరోసారి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. లింగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులకు పదో తరగతి విద్యార్థులు హాజరుకావాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న లక్ష్య కార్యక్రమం అమలు తీరుపై ఆరా తీశారు. విద్యార్థులకు పాఠం చెబుతూ పలు ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. ఆయన వెంట పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బాలాజీ ఉన్నారు.

పోలీసుల కోసం క్యాంటీన్

- ఎస్పీ ప్రవీణ్‌కుమార్



క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: డీజీపీ ఆదేశాల మేరకు పోలీసుల సౌకర్యార్థంకై పోలీసు వెల్ఫేర్ క్యాంటీన్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిర్మల్ పట్టణ పోలీసు స్టేషన్ పక్కన నూతనంగా నిర్మించిన వ్యాపార సముదాయంలో పోలీసు వెల్ఫేర్ క్యాంటీన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీసులకు అవసరమైన నిత్యావసర సరుకులు, ఎలక్ట్రానిక్ పరికరాలు అన్ని రకాల వస్తువులు వ్యాపార సముదాయంలో తక్కువ ధరకు లభిస్తాయన్నారు. వెల్ఫేర్ క్యాంటీన్‌తో డబ్బులు ఆదా అవుతాయని తెలిపారు. అనంతరం ఎస్పీ క్యాంటీన్‌లో సరుకులను కొనుగోలు చేసి బిల్లు చెల్లించారు. తర్వాత పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు ఎస్పీ(ఏఆర్) వెంకటేశ్వర్లు, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పట్టణ సీఐ పురుషోత్తం, ట్రాఫిక్ ఎస్సై దేవేందర్, జిల్లాలోని సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'సిరాల' నిర్మిస్తేనే.. ముందుకు 'సాగే'ది

- ఈ ఏడాది వానాకాలంలో తెగిన పురాతన ప్రాజెక్టు
- వానాకాలం, యాసంగిలో ఎకరం కూడా సాగవని వైనం..
- ప్రాజెక్టు పునర్నిర్మాణంలో జాప్యం
- కొత్త ప్రభుత్వంపై ఆయకట్టు రైతుల ఆశలు

భైంసా/భైంసారూరల్: నిజాం కాలంలో.. సుమారు 139 ఏళ్లక్రితం నిర్మించిన ముధోల్ నియోజకవర్గంలోని సిరాల ప్రాజెక్టు ఈవానాకాలంలో భారీ వర్షాలు, వరదలకు కొట్టుకుపోయింది. ఆయకట్టు ఆనవాళ్లు కూడా చేసింది. ఈ ప్రాజెక్టు నుంచి సిరాల, ఇలేగాం, మచ్కల్, రాంటేక్, ముద్గల్, దేగాం, వాలేగాం గ్రామాల వరకు పంటలకు సాగునీరందేది. సుమారు 4 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ ప్రాజెక్టు భారీ వర్షాలకు జూలై 27న తెగిపోయింది. అప్పటికే వేసిన పంటలను వరద ముంచెత్తింది. ఇసుక, రాళ్లు చేళల్లో మేటలు వేశాయి. చేల ఆనవాళ్లు కూడా కానరాకుండా పోయాయి. హద్దులు చెరిగి గుట్టలుగా మారిన పంటచేలను చూసి రైతులు కన్నీరుమున్నీరయ్యారు.

రెండు పంటలు కోల్పోయిన రైతులు..
సిరాల ప్రాజెక్టు తెగడంతో ఆయకట్టుతోపాటు ప్రాజెక్టునీటిలో కొట్టుకుపోయిన బాధిత రైతులు ఖరీఫ్, యాసంగి పంటలను కోల్పోయారు. ప్రాజెక్టు తెగడంతో వేసిన ఇసుక, మట్టి, రాళ్ల మేటలు ఇంకా చేలల్లో దర్శనమిస్తున్నాయి. పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ రూపాయి కూడా రాలేదని రైతులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే వచ్చే ఖరీఫ్‌లోనైనా పంటలు వేసుకుంటామని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఆనవాళ్లు కోల్పోయిన కాలువ...
సిరాల ప్రాజెక్టు కింద రూ.4 కోట్లతో ఏడు కిలోమీటర్ల మేర సీసీ కెనాల్ నిర్మించారు. భారీ వర్షాలకు ప్రాజెక్టు తెగడంతోనే కాలువలు కూడా ఆనవాళ్లు కోల్పోయాయి. కాలువల నిండా మట్టి కూరుకుపోయింది. కాలువల్లో మట్టిని తొలగించడంతోపాటు తెగిపోయిన కాలువలకు మరమ్మతులు చేపట్టాలి.

తగ్గుతున్న భూగర్భ జలాలు..
139 ఏళ్లుగా ఎన్నడూ సిరాల ఆయకట్టు ఎండలేదని రైతులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ప్రాజెక్టు తెగడంతో తొలిసారిగా రెండు పంటలు కోల్పోయామని అంటున్నారు. ప్రాజెక్టులో చుక్క నీరు లేకపోవడంతో బోర్లు, బావులు కూడా అడుగంటుతున్నాయని తెలిపారు. ఇలేగాం, సిరాల గ్రామాల్లో ఇప్పటికే బోరుబావులు వట్టిపోతున్నాయని చెబుతున్నారు. యాసంగిలో బోర్లు, బావుల కింద సాగుచేసిన పంటలు కూడా చేతికి వస్తాయన్న నమ్మకం లేదని అంటున్నారు.

రూ.11 కోట్లతో ప్రతిపాదన..
ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో రైతులు వానాకాలం, యాసంగి పంటలు వేయలేదు. ప్రాజెక్టు పునర్నిర్మాణానికి రూ.11 కోట్లు అవసరమవుతాయని అధికారులు గత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇటీవలి ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో మరోసారి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలా, పాత ప్రతిపాదనలనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలా అని నీటిపారుదల శాఖ అధికారులు చర్చించుకుంటున్నారు. కొత్త ప్రభుత్వం త్వరగా స్పందించి నిధులు మంజూరు చేస్తేనే వచ్చే ఖరీఫ్ నాటికి ప్రాజెక్టు పునర్నిర్మించే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ విషయమై ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ ఇటీవలే ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.




తెగిపోయిన సిరాల ప్రాజెక్టు కట్ట




పొలాల్లోకి కొట్టుకు వచ్చిన మట్టి, రాళ్లు

త్వరగా నిర్మించాలి



సిరాల ప్రాజెక్టును త్వరగా నిర్మించాలి. ఈ యేడు రెండు పంటలువేసుకోలేకపోయాం. సిరాల ప్రాజెక్టుపైనే ఆధారపడి జీవిస్తున్నాం. ప్రాజెక్టుకు గండిపడడంతో కోట్ల రూపాయలు నష్టపోయాం. ప్రాజెక్టు నిర్మిస్తే పంటలకు నీరందుతుంది. అధికారులు స్పందించి త్వరగా నిర్మాణం ప్రారంభించాలి.
– యూసుఫ్, సిరాల

మొదటిసారి తెగింది



చిన్నప్పటి నుంచి ఇదే గ్రామంలో పెరిగాం. ఈ ప్రాజెక్టుపైనే ఆధారపడి రైతులంతా బతుకుతున్నారు. ప్రాజెక్టు ఎప్పుడూ నిండుగా ఉండేది. జూలైలో కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టు కొట్టుకుపోయింది. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రాజెక్టును త్వరగా పునర్నిర్మించి ఆయకట్టుకు నీరందించాలి.
– సదాశివ్, సిరాల

ప్రభుత్వానికి నివేదించాం..
తెగిపోయిన సిరాల ప్రాజెక్టును ఈఎన్‌సీ నాగేందర్ ఇటీవలే సందర్శించారు. ప్రాజెక్టు తెగిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. కొత్తగా ప్రాజెక్టు నిర్మించాలని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రధాన కాలువ సైతం కొట్టుకుపోయింది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.
– రామారావు, నీటి పారుదల శాఖ ఈఈ

అండర్ 17 క్రికెట్ చాంపియన్‌గా నిర్మల్



గెలుపొందిన నిర్మల్ జట్టు

నిర్మల్‌చైన్‌గేట్: టెన్ స్క్వేర్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీ20 క్రికెట్ టోర్నీ విజేతగా నిర్మల్ లక్కీ అకాడమీకి చెందిన టీం విజయం సాధించింది. ఈనెల 26 నుంచి 29 వరకు హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లోని బీఎన్‌రెడ్డి గ్రౌండ్‌లో నిర్వహించిన అండర్ – 17 టీ20 మ్యాచ్‌లో శుక్రవారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. హైదరాబాద్‌పై నిర్మల్ జటుట విజయం సాధించిందని లక్కీ అకాడమీ కోచ్ సుదర్శన్ తెలిపారు.

నెట్ బాల్ పోటీలకు ఎంపిక
నిర్మల్ టౌన్: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని వాగ్దేవి స్కూల్ విద్యార్థి ఎంపికయ్యాడు. స్థానిక చైతన్య స్కూల్లో నిర్వహించిన స్టేట్ లెవెల్ నెట్‌బాల్ ఎంపిక పోటీల్లో వాగ్దేవి స్కూల్ విద్యార్థి యోషిత్ వర్ధన్ ఎంపికయ్యారని నెట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగాధర్, సెక్రెటరీ రాజు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ నాయుడు మురళి అభినందించారు.

క్లుప్తంగా

సెల్ టవర్ బ్యాటరీల చోరీ



షెల్టర్‌లో చిందరవందరగా సామగ్రి

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–బాసర రోడ్డులో ఆటోనగర్ చౌరస్తా సమీపంలోని ఎయిర్‌టెల్ టవర్ షెల్టర్ నుంచి 14 బ్యాటరీలు చోరీకి గురైనట్లు సీఐ శ్రీను తెలిపారు. ఈనెల 27న రాత్రి కారులో వచ్చిన కొందరు దుండగులు టవర్ షెల్టర్ తాళాలు పగులగొట్టి అందులోని రూ.50వేల విలువైన బ్యాట రీ సెల్స్‌ను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు ఎయిర్‌టెల్ టవర్ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆటో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో గురువారం రాత్రి ఆటో చోరీకి గురైంది. టూటౌన్ సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. చిచ్‌ధరి ఖానాపూర్‌కు చెందిన వాగ్మారే సతాగత్ తన భార్యను రిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. ఆమె నిండు గర్భిణి కావడంతో ప్రసవం కోసం ఆటోలో తీసుకొచ్చి చేర్పించాడు. రిమ్స్ ఆవరణలో ఆటోను పార్కింగ్ చేయగా, ఆ తర్వాత వచ్చి చూసేసరికి కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. బాధితుడు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముగ్గురికి మూడేళ్ల జైలు

కడెం: హత్యాయత్నం కేసులో మండలంలోని పెద్దూర్ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు కోర్టు మూడేళ్ల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై కొసన రాజు తెలిపారు. వేరే గ్రామం నుంచి వచ్చి పెద్దూర్‌లో కార్పెంటర్‌గా పనిచేస్తున్న ఏనుగార్తి శ్రీనివాస్ ఉపాధి దెబ్బతీస్తున్నాడని భావించి అదే గ్రామానికి చెందిన కూచనపల్లి నర్సయ్య, శ్రీగద్దె దిలీప్, శ్రీగద్దె శ్రీనాథ్‌లు కక్ష్య పెంచుకున్నారు. గత ఏడాది రాత్రి సమయంలో శ్రీనివాస్‌పై కర్రలతో దాడి చేశారు. అడ్డు వచ్చిన అతడి భార్య, బామ్మర్దిపై కర్రలతో దాడి చేసి చంపే ప్రయత్నం చేశారు. దీంతో శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రాజు కేసు నమోదు చేశారు. ఈ కేసులో వాదోపవాదలు జరిగిన తర్వాత శుక్రవారం నిర్మల్ అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జి అజేశ్‌కుమార్ ఆ ముగ్గురు నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.4500 జరిమానా విధించారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

నిర్మల్‌టౌన్: మద్యం తాగి బైక్ నడిపిన వ్యక్తికి ఐదురోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ.. శుక్రవారం కోర్టు తీర్పునిచ్చింది. నిర్మల్ రూరల్ ఎస్సై చంద్రమోహన్ వివరాల ప్రకారం.. పట్టణంలోని రామ్‌రావ్ బాగ్‌కు చెందిన దాసరి సాయి చరణ్ 8 మార్చి 2023 నిర్మల్ రూరల్ పరిధిలో పోలీసులు తనిఖీ చేస్తుండగా మద్యం తాగి పట్టుబడ్డాడు. ఈ సందర్భంగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అజీజ్ రెహమాన్ ఐదు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు.

వివాహిత అదృశ్యం

భైంసాటౌన్: మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన చాకలి పద్మ(35) వివాహిత శుక్రవారం అదృశ్యమైనట్లు పట్టణ సీఐ ఎల్ శ్రీను తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇంట్లో గొడవపడి ఉదయం 10.30 గంటలకు కామోల్‌లోని ఇంటి నుంచి భైంసాకు బయలుదేరి వెళ్లినట్లు భర్త భోజన్న ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

బడులకేదీ ఉచితం..



డిజిటల్ తెరపై పాఠాలు వింటున్న విద్యార్థులు

- ఉచిత విద్యుత్ ప్రభుత్వ బడులకిస్తేనే సముచితం
- రూ.వేలల్లో పేరుకుపోతున్న బిల్లులు
- స్కూల్ గ్రాంట్‌లో సింహభాగం విద్యుత్ బిల్లులకే
- దృష్టి సారించాలంటున్న ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీలు

జిల్లాల్లోని పాఠశాలల వివరాలు..

జిలా	పాఠశాలలు
ఆదిలాబాద్	1,279
కుమురం భీం	1,148
మంచిర్యాల	847
నిర్మల్	842

నిర్మల్‌ఖిల్లా: గృహ అవసరాలకు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలకు కూడా ఉచితంగా విద్యుత్ అందించాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధనకు అంకురార్పణ జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోర్డులు, ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. దీనికి తోడు ప్రొజెక్టర్లు, ఎల్‌ఈడీ టెలివిజన్లు కూడా ఆయా ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశారు. దీనితోపాటు బల్బులు, ఫ్యాన్లు రోజువారీ కార్యకలాపాల కోసం కంప్యూటర్లు పనిచేస్తున్నాయి. విద్యార్థుల నిష్పాదన, మార్కులను నమోదు చేయడానికి ట్యాబ్‌లు అందించారు. వీటి చార్జింగ్, ఇతరత్రా అవసరాలకు విద్యుత్ తప్పనిసరి. ఈ నేపథ్యంలోనే ఆయా పాఠశాలలకు ఉచిత విద్యుత్‌ను అందించాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపులకే...

ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ కనెక్షన్ అందుబాటులో ఉన్న వాటికి వేలల్లో విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ అకౌంట్లలో స్కూల్ గ్రాంట్లు ప్రభుత్వం వేసిన తర్వాతనే విద్యుత్ బిల్లులను చెల్లించాల్సి ఉంటుందని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ సభ్యులు పేర్కొంటున్నారు. అప్పటి వరకు పేరుకుపోయిన బిల్లులను చెల్లించేందుకే స్కూల్ గ్రాంట్లు వినియోగం అవుతున్నాయని వాపోతున్నారు. బడులకు అందించే విద్యుత్ ఏడవ కేటగిరీలో చార్జీలను వసూలు చేస్తున్నారు. ఇందులో యూనిట్ విద్యుత్‌కు 8.30 వసూలు చేస్తున్నారు.

అదనపు భారమే ఇది...



పాఠశాలలకు ప్రతినెల వస్తున్న విద్యుత్ బిల్లులు అదనపు భారంగా పరిణమిస్తున్నాయి. యూనిట్ విద్యుత్ చార్జి రూ.8 పైగా ఉండడంతో ఆరు తరగతి గదులు ఉన్న ప్రాథమిక పాఠశాలలకు నెలకు సుమారు రూ.800 వరకు ఆరు నుంచి పది గదులు ఉన్న ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు నెలకు సగటున రూ.1100 పైన బిల్లులు వస్తున్నట్లు సమాచారం. అదనంగా సర్‌చార్జీలు, ఆలస్య జరిమానాల రూపంలో మరో 200 వరకు బిల్లుకు కలుస్తోంది. దీంతో ఆయా పాఠశాలలకు ప్రతీఏటా రూ.10వేల నుంచి 12వేల వరకు విద్యుత్ బిల్లులకే వ్యయం అవుతున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఉచితంగా అందిస్తే మేలు...



ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యుత్‌ను అందించడం సమంజసంగా ఉంటుంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులుగా మేము సైతం ఉచిత విద్యుత్‌ను అందివ్వాలని ఇప్పటికే విజ్ఞప్తి చేశాం. స్కూల్ గ్రాంట్‌లకు విడుదలవుతున్న నిధుల్లో చాలావరకు విద్యుత్ బిల్లులకే ఖర్చు చేస్తున్నారు.

– ఎస్.భూమన్న యాదవ్, జిల్లా అధ్యక్షుడు, స్టేట్ టీచర్స్ యూనియన్, నిర్మల్

డిజిటల్ బోధనకు తోడ్పాటు...



ప్రభుత్వ బడుల్లో ఉచిత విద్యుత్‌ను అందివ్వడం ద్వారా ఆ పాఠశాలలో ప్రస్తుతం అమర్చిన డిజిటల్ ప్యానెల్ బోర్డులు, ఎల్ఇడి తెరలు మరింత ఎక్కువగా వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వం పాఠశాలలకు ఉచిత విద్యుత్ పూర్తిస్థాయిలో అందివ్వాలి. బోధన కూడా విద్యార్థులకు సులువుగా అర్థమవుతుంది.

– కొత్త కాపు రాజేశ్వర్, ఎస్‌ఎంసి చైర్మన్, సోన్

దేవుని చెరువు జాతరకు వేళాయె

- నేడు శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామి కల్యాణం
- జాతరకు ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ సభ్యులు



కొలువుదీరిన ఆది దంపతుల విగ్రహాలు

సర్సాపూర్(జి): మండల కేంద్రం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవిలో ప్రకృతి ఒడిలో దేవుడి చెరువు సమీపంలో స్వయంభువుగా వెలిసిన శ్రీభ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయ జాతర నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా మార్గశిర మాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే తొలి శనివారం ఆది దంపతులైన శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామికి కల్యాణం, మరుసటి రోజు జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఆలయాన్ని 1974 లో శ్రీ శంకరాచార్యుల శిష్యులు శ్రీవిద్యారణ్య, శ్రీ కృష్ణానంద స్వాములు ఏర్పాటు చేయగా ఇక్కడే రేణుక ఎల్లమ్మ, ఆంజనేయ స్వామి ఆలయాలున్నాయి.

ఆదివారం జాతర...

జాతర సందర్భంగా ఉదయం శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామివారికి పూలు, పత్రి, పసుపు (బండారి)తో అభిషేకం నిర్వహిస్తారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన వరి ధాన్యాన్ని బియ్యంగా మార్చి చేసిన పాయసం స్వామివారికి నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి వన భోజనాలు చేసి ఉత్సాహంగా గడుపుతారు. ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు దిలావర్‌పూర్, కుంటాల, లోకేశ్వరం మండలాల నుంచి సుమారు ఆరేడు వేల మంది భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు గ్రామ సర్పంచ్ అరుగుమీది రాంరెడ్డి, జెడ్పీటీసీ చిన్న రామయ్య, ఎంపీటీసీ మల్లేష్ తెలిపారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సర్సాపూర్(జి) ఎస్సై రవీందర్ పేర్కొన్నారు.

నేడు ఆది దంపతుల కల్యాణ మహోత్సవం...

శనివారం ఉదయం స్వస్తి పుణ్యాహవాచనం, మూలవిరాట్ అభిషేకం, స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ప్రధా న వీధుల గుండా ఊరేగించి ఆలయానికి తీసుకువెళ్తారు. అనంతరం పురోహితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించి భక్తులకు అన్నదానం చేస్తారు. కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తారు.

ప్రభుత్వ బడికి గ్రామస్తుల తాళం

- బడి ఆవరణలో బైఠాయించి నిరసన
- ముగ్గురు ఉపాధ్యాయులు గైర్హాజరు
- ఒక రోజు వేతనం నిలిపివేత



ఆందోళనలో గ్రామస్తులు, సర్పంచ్ ముత్తగౌడ్

లోకేశ్వరం: నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం రాజూర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల(ఇంగ్లిష మీడియం)లో శుక్రవారం ముగ్గురు ఉపాధ్యాయులు గైర్హాజరు కావడంపై గ్రామస్తులు ఆగ్రహించారు. సర్పంచ్ ముత్తగౌడ్, వీడీసీ చైర్మన్ నర్సారెడ్డి, విద్యాకమిటీ చైర్మన్లు సాయిప్రసాద్, జావీద్, అలీం, ముజాహిన్, విద్యార్థుల తల్లిదండ్రులు సాయన్న, సంజీవ్, పోతన్న బడికి తాళం వేసి ఆవరణలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థ పటిష్టానికి గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ) ఆధ్వర్యంలో పాఠశాలలో 12మంది విద్యావాలంటీర్లను నియమించారు. వీరికి నెలనెల వీడీసీ నుంచి రూ.82వేతనాలు చెల్లిస్తున్నారు. పాఠశాలలో పదేళ్ల క్రితం 37నుంచి 40 మంది విద్యార్థులు ఉండగా.. వీడీసీ సభ్యుల చొరవతో ప్రస్తుతం 244కు చేరింది. ప్రభుత్వం ముగ్గురు ఉపాధ్యాయులను నియమించింది. శుక్రవారం ఉదయం ప్రార్థన సమయంలో ఉపాధ్యాయులు హాజరు కాకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఉపాధ్యాయ సిబ్బంది గదికి తాళం వేసి రెండు గంటలపాటు ఆవరణలో విద్యార్థులతో కలిసి బైఠాయించారు. సర్పంచ్ ముత్తగౌడ్ డీఈవో రవీందర్‌రెడ్డికి ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. డీఈవో స్పందిస్తూ.. ప్రధానోపాధ్యాయుడు సెలవుపై వెళ్లాడని, ఉపాధ్యాయులు రాజేశ్వర్, లావణ్య, ప్రవీణ్ అనుమతి లేకుండా వెళ్లారని తెలిపారు. వీరికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని, ఒక రోజు వేతనం నిలిపి వేస్తున్నామని ప్రకటించారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

కాలుష్యాన్ని అరికట్టాలి



రాబిన్‌సింగ్‌ను సన్మానిస్తున్న ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్

భైంసా: కాలుష్యాన్ని అరికట్టడం అందరి బాధ్యత అని రాబిన్‌సింగ్ అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్ ఇండియా మూమెంట్ పేరుతో రాబిన్‌సింగ్ సైకిల్‌యాత్ర ప్రారంభించారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన రాబిన్‌సింగ్ 2022, అక్టోబర్ 6న సైకిల్ యాత్రను మొదలు పెట్టారు. 449 రోజులుగా ప్రయాణంచేస్తున్నారు. శుక్రవారం బాసర ట్రిపుల్ ఐటీకి చేరుకున్నాడు. ఇప్పటి వరకు 26,648 కిలోమీటర్ల దూరం ప్రయాణించి మార్గమధ్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ వస్తున్నామని తెలిపారు. 2024, మార్చి 7న భోపాల్‌లో తన సైకిల్‌యాత్ర ముగుస్తుందని వెల్లడించారు. ట్రిపుల్‌ఐటీకి చేరుకున్న రాబిన్‌సింగ్‌ను విద్యార్థులు, అధ్యాపక బృందం స్వాగతం పలికారు. విద్యార్థులతో కలిసి ట్రిపుల్‌ఐటీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్ సైకిల్‌యాత్ర చేపడుతున్న రాబిన్‌సింగ్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

దోషులను జైలుకు పంపుతాం

- మాజీ ఎమ్మెల్సీ రాముల్ నాయక్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాముల్ నాయక్

నేరడిగొండ: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో అవినీతి తేలితే దోషులను జైలుకు పంపుతామని మాజీ ఎమ్మెల్సీ రాముల్ నాయక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, త్వరలోనే కేంద్రంలో రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ జెండా ఎగరబోతుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు ఎంపీ సీట్లు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకొని పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించి, మిగులు బడ్జెట్ గల రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు సీతారాంరెడ్డి, శివాజీ, సుధాకర్ రెడ్డి, కిరాణ అసోసియేషన్ మండల అధ్యక్షులు ముక్క శ్రీనివాస్, బొందిడి సర్పంచ్ ఆడె అనిత జనార్దన్, వడూర్ మాజీ ఎంపీటీసీ గాదె రవిందర్, నాయకులు రాథోడ్ సుభాష్, మధుకర్ పాల్గొన్నారు.

మొక్కలు ధ్వంసం చేసిన వారిపై కేసు

తలమడుగు: మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనంలో మొక్కలను ధ్వంసం చేసిన ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు పద్మాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఆలయ సమీపంలో గతంలో పల్లెప్రకృతి వనంలో మొక్కలు నాటారు. మొక్కలు ఏపుగా పెరిగాయి. అధికారులు, గ్రామ సర్పంచ్‌ల అనుమతి లేకుండా ఆ మొక్కలను జేసీబీ సాయంతో తొలగించారు. దీంతో గ్రామపంచాయతీ కార్యదర్శి అశోక్ పల్లె ప్రకృతి వనంలో మొక్కలు ధ్వంసం చేశారని, దీంతో పాటు ప్రభుత్వ ఆస్తులకు పద్మాకర్‌రెడ్డి నష్టం కలిగించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యదర్శి అశోక్ ఫిర్యాదు మేరకు ఎస్సై ధనశ్రీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీ క్యాబిన్ దగ్ధం

- తప్పిన ప్రాణ నష్టం



ప్రమాదంలో కాలిపోతున్న లారీ క్యాబిన్

గుడిహత్నూర్: మండలంలోని సీతాగోంది పెట్రోల్ పంప్ సమీపంలో ఓ కంటెయినర్ లారీ డ్రైవర్ క్యాబిన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. డ్రైవర్ రాంకుమార్ గమనించి పక్కనే ఉన్న పార్కింగ్‌లో నిలిపి వేశాడు. అప్పటికే మంటలు చెలరేగడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అయినప్పటికీ లారీ క్యాబిన్ పూర్తిగా దగ్ధమైంది. లారీ కంటెయినర్‌లోని సామగ్రికి ఎలాంటి నష్టం కలుగలేదు. కాగా ఈ కంటెయినర్ అంబాల నుంచి బెంగళూరు వెళ్తున్నట్లు డ్రైవర్ తెలిపారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

బేల: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలోని జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మండలంలోని చప్రాల గ్రామానికి చెందిన మెంగంవార్ సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఆర్టీసీ బస్సును రాంగ్‌రూట్‌లో ఓవర్‌టెక్ చేయడానికి ప్రయత్నించిన లారీ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం ఆర్టీసీ బస్సు, లారీకి మధ్య ఇరుక్కుపోయింది. దీంతో ద్విచక్రవాహనం నడుపుతున్న సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరీక్షించిన వైద్యాధికారి వంశీకృష్ణ ప్రాథమిక చికిత్స చేసి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. పోలీసులు ఈ సంఘటన స్థలాన్ని పరిశీలించి లారీ డ్రైవర్‌ను అదుపులో తీసుకుని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

డ్రైనేజీలోకి దూసుకెళ్లిన కారు

నిర్మల్‌టౌన్: కారు అదుపుతప్పి డ్రైనేజీలోకి దూసుకుపోయిన సంఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ... ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వెళ్తున్న కారు స్థానిక స్టార్ ఫంక్షన్ హాల్ వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న డ్రైనేజీలో పడిపోయింది. వెంటనే స్థానికులు స్పందించి వారిని కాపాడారు. స్వల్ప గాయాలు కాగా వారిని ఆసుపత్రికి తరలించారు.

ఇంటికి చేరిన విద్యార్థి



విద్యార్థితో పోలీసులు, కుటుంబీకులు

ముథోల్: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ గురుకుల పాఠశాలలో మొదటి సంవత్సరం బైపీసీ చదుకుంటున్న విద్యార్థి భయాసాహెబ్ ఈ నెల 26వ తేదీన కళాశాల నుంచి అదృశ్యమయ్యాడు. 27వ తేదీన ప్రిన్సిపల్ అమృతయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శుక్రవారం విద్యార్థి తానూరు మండలంలోని వడ్గాం స్వగ్రామానికి చేరుకున్నాడు. ఈ విషయం కుటుంబీకులు పోలీసులకు తెలిపారు. దీంతో ఎస్సై సాయికిరణ్ విద్యార్థి ఆచూకీ లభ్యమైనట్లు వెల్లడించాడు.

సాగుతున్న గాలింపు చర్యలు

ఇంద్రవెల్లి: ఈ నెల 26న ఇంద్రవెల్లి మండలంలోని కొబ్బయ్‌గూడ గ్రామ సమీపంలోని చెరువు వద్ద అదృశ్యమైన మండలంలోని అంజీ గ్రామానికి చెందిన గారుశే నాందేవ్ కోసం పోలీసులు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. నాందేవ్‌కు తోడుగా వెళ్లిన రమేష్, మారుతి, డిగంబర్‌లు ఇచ్చిన సమాచారం మేరకు శుక్రవారం చెరువులో రెండోరోజు గజఈతగాళ్ల, అంజీ గ్రామానికి చెందిన యువకులతో గాలింపు చర్యలు చేపట్టారు. చెరువు చుట్టుపక్కల వ్యవసాయ చేన్లలో సాయంత్రం వరకూ పరిశీలించినా అదృశ్యమైన గారుశే నాందేవ్ ఆచూకీ దొరకలేదని ఎస్సై దుబ్బక సునీల్ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ పంచాయతీ పరిధిలోని గంగాయిపేట్ గ్రామంలో శుక్రవారం గుడుంబా స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎస్సై రమేష్ తెలిపారు. ఈ మేరకు గ్రామ శివారులో కనుగొన్న 300లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామని పేర్కొన్నారు. సిబ్బంది ముత్యం, సాయి, రవీందర్, వెంకటేష్, రవళి పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ముథోల్: మండలంలోని ఎడ్‌బీడ్ గ్రామానికి చెందిన జాదవ్ అంబర్‌సింగ్(53) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికిరణ్ శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జాదవ్ అంబర్‌సింగ్ కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో మద్యానికి బానిసై మానసికంగా బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురై గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

మొబైల్ శిబిరాలతో మెరుగైన వైద్యసేవలు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా మొబైల్ మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఏజెన్సీ అదనపు వైద్యాధికారి డాక్టర్ కుమ్ర బాలు తెలిపారు. గాదిగూడ మండలం చిత్తగూడ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన శిబిరాన్ని ఆయన పరిశీలించారు. గిరిజన గ్రామాల్లో దగ్గు, జలుబు, అస్తమా వంటి వాటితో బాధపడుతుంటారని, ఆస్పత్రులు సమీపంలో లేక ఇబ్బంది పడుతుంటారని అన్నారు. అలాంటి వారి కోసం క్షేత్రస్థాయికి వెళ్లి మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు మొబైల్ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యులు ప్రవీణ్‌కుమార్, స్వరూప్, హెచ్‌ఈవో తులసీదాస్ రాథోడ్, పవార్ రవీందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ తోట మాలికి ఘన సన్మానం

- సాంబయ్య సేవలు కొనియాడిన పీవో



సాంబయ్యను సన్మానిస్తున్న పీవో, అధికారులు

ఉట్నూర్‌రూరల్: 36ఏళ్లుగా ఐటీడీఏ ఉద్యన నర్సరీలలో తోటమాలిగా సేవలందించి ఈ నెల పదవి విరమణ చేయనున్న దానేపల్లి సాంబయ్యను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని చాహత్ బాజ్‌పాయ్ శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అనంతరం సాంబయ్య సేవలను కొనియాడారు. 20ఏళ్లుగా మంచిర్యాల జిల్లా భీమారం నర్సరీలో, మరో 16 ఏళ్ల పాటు ఆసిఫాబాద్ జిల్లాలోని జంబుగ నర్సరీలో పనిచేయడం గొప్ప విషయమన్నారు. ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్ అధ్యక్షతన జరిగిన సన్మాన వీడ్కోలు కార్యక్రమంలో సాంబయ్యతో కలిసి పని చేసిన తోటి ఉద్యోగులు తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ భీంరావు, పీహెచ్ఓ సందీప్‌కుమార్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి రాంబాబు, ఉద్యన అధికారి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ పరిశీలన



ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్‌క్యాస్ బృందం

నార్నూర్: ఉత్తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపిక చేయడానికి ఎన్‌క్యాస్ (నేషనల్ క్వాలిటీ ఆసురేన్స్ సర్టిఫికెట్స్) ఢిల్లీ వైద్య బృందం సభ్యులు డాకర్లు రాజ్‌కుమార్, ప్రమోద్‌కుమార్‌సాహులు డీఎంవో శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ్‌లతో కలిసి గాదిగూడ మండలంలోని ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ స్థాయిలో రోగులకు అందుతున్న వైద్యాన్ని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ వైద్యుడు సంజీవ్, జడ్పీటీసీ గంగుబాయిసోము, సర్పంచ్ జాకు, హెచ్‌ఈవో సంజీవ్ ఉన్నారు.

మళ్లీ అదే ‘వరుస’..!



భైంసాటౌన్:భైంసా పట్టణంతో పాటు ముథోల్, తానూ రు మండలాల దరఖాస్తు దారులు సైతం భైంసాలోని కేంద్రానికే వస్తున్నారు. ఈ సేవ కేంద్రం నిర్వహకులు రోజుకు వంద టోకెన్లు మాత్రమే ఇస్తున్నారు. దీంతో దూరప్రాంతాల దరఖాస్తుదారులు ఉదయం 5 గంటల నుంచే కేంద్రం వద్దకు చేరుకుని చెప్పులను వరుసలో ఉంచి నిరీక్షిస్తున్నారు. చిన్నపిల్లలతో వచ్చి మహిళలు, వృద్ధులు ఉదయమే వచ్చి చలిలో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా తమ ఇబ్బందులు తీర్చాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.